# విముక్తి

పి. శ్రీనివాసరావు

త్రన రిక్షాని గోడకానించి, దీనంగా చూచున్నాడు. రోజల్లా అవస్థపడ్డా, తనకు చివరకుమిగిలింది అణా! రిక్షాకుషన్' యెత్తి లోపలికి తొంగిచూశాడు. మళ్ళీ మూసివేశాడు. అదే అతని 'క్యాష్‌బాక్స్.' ఒకప్పుడు దాంట్లో డబ్బులు గలగల లాడేవి—ఒకప్పుడంటే ట్రాములు, మోటార్ కార్లు, బస్సులు, తక్కువగావుండే రోజుల్లో. ఆరోజుల్లో అతని జీవితం సుఖంగా, సాఫీగా గడిచింది. ఆరోజుల్లో అతనికో స్వంత రిక్షా వుండేది, కాలువగట్టున ఓ శుభ్రమైన పాక వేసుకున్నాడు. చీకటిపడ్డ తర్వాత యేనాడూ రిక్షాలాగి తిరుగలా. అందుకు కారణం ఆరోజుల్లో రాత్రుళ్ళు జనసంచారం తక్కువగా వుండడమే.

తను మొదటిసారిగా రిక్షాలాగింది తన పద్ధాలుగో సంవత్సరంలో. యిప్పుడు వయస్సు మళ్ళిపోయింది. ఐతే యేం? యిప్పటికీ తక్కిన వాళ్ళకంటే జోరుగానే లాగ్గలడు. పోట్లాటల విషయం వస్తే యేమాత్రం అవతలివాడికి తీసిపోడు. మూడు నాలుగు సీసాల కల్లుతాగాక కూడా జాగర్తగా యిల్లుజేరుకో గలడు. తన శరీర మేమన్నా ముడతలు పడిందా లేకుంటే తలవెండ్రుకలేమేనా నరిసాయా ముసలివాడనుకో డానికి? లైసెన్సు బిళ్ళ కోసం వెళ్ళినపుడల్లా వాళ్లు తనవయసడిగితే యెంత చీకాకుకలిగేది? కొన్ని సంవత్సరాల క్రితం తనకు వయసెంతో తెలీదని చెబితే నలభై వుండొచ్చని అన్నారు. వాళ్లు పోయిన సంవత్సరం అరవైఐదుండొచ్చన్నారు. యెవరి వయసువాళ్ళకి తెలీకుండడం నిజంగా సిగ్గుచేటే!

ప్రతిదినం బాగా సంపాయించే వాళ్ళనిచూచి వెంకడు అసూయపడే వాడు, ఆ మల్లయ్య తను కోరిన కూలి సంపాయించే వాడు; పావలా అడిగితే పావలే. రాముడు బలే వుపాయశాలి. వాడు పావలా సంపాయించాలని మనసులో అనుకొని, అరణాలు చెప్పి, బేరం అంతా ఐంతర్వాత యెటుదిరిగీ పావలా గిట్టించుకొనే వాడు. యెటుబోయినా తనకే యీగతి. కొంచెం యేమాత్రమయినా కూలి యెక్కువ అడిగితే, తన మొఖానికేసి యెగాదిగా చూచి చక్కా వెళ్ళిపోయే వారు. తక్కిన వాళ్ళకంటె తనేం పాపం చేసుకున్నాడు?

వెంకడికి విసుగెత్తిపోయింది ఆ అవస్థలు పడలేక. అతని అదృష్టం హీనస్థితిలో వుండకపోతే, దినమంతా కష్టపడ్డా, చివరికి తనచేతుల్లో మిగిలేది ఓఅణా బిళ్ళా? ఇక రిక్షా బాడుగ అరణాలు చెల్లించడమేలా? తన సంసారం గడుపుకొనే విధమేది?...తన మొదటి భార్య చనిపోయాక కూడా అతను తన తాగుడుమాత్రం మానలా! ఆమె బోధించిన నీతులన్నీ మట్టిలో కలిశాయి. సాయంత్రం యింటికొచ్చేప్పుడు బాగా తాగి వొళ్లుతెలియకుండా ప్రవర్తించే వాడు. దానిమూలాన రోజు కలహం... అప్పటికీ బుద్ధితెచ్చుకోక, వెంకడు రెండో పెళ్ళి చేసుకున్నాడు. రెండో పెళ్లాం కేవలం రాకాసి. అతనిప్పుడు డబ్బులు చాలక తాగుడు మానివేసినా, ప్రాణాలు పీక్కుతింటుంది. ఇంటికి డబ్బులు తీసుకపోయాడంటే సరి వుండనేవుంటుంది హోరాహోరి!

ఆ ఒక్క అణాతో యింటికెళ్ళటానికి మనసొప్పలా సగం భయంతో...కూలి గోసం బాటసారుల్ని ప్రార్థించడం. గొడ్డులా పగల్లా రిక్షా లాగడం, అంటే ఓవిధమైన చీకాకు వేయసాగింది... అసలు జీవితమే అతనికి నిస్సారంగాను, విసుగుదలగాను, వుంది...ఆ రిక్షా యజమాని అసలే చండప్రచండుడు. రిక్షా బాడుగ యివ్వడం కాస్త ఆలస్యమయిన తిట్లు, తన్నులు తప్పదు; తానిప్పుడు మూడురోజుల బాడుగివ్వాలి. తనిపుడు రూపాయిబేడ యెక్కణ్ణుంచి తేవాలి? అతనెన్నాళ్లు ఆ రిక్షా యజమాని తిట్లు, తన్నులూ భరిస్తాడూ? యేమయినా సరే వెంకడు మనసు ధైర్యం చేసుకున్నాడు. అతనేమన్న నోరుజారనిస్తే బాగా తన్నాలని నిశ్చయించుకున్నాడు. యింటివద్ద భార్యకూడా కస్సుబుస్సుమంటే శాస్తి చేయాలి. అంతే.

ఒక్కమారు తన గతజీవితాన్ని సింహావలోకిస్తే, అతనికి క్షీణతే గోచరించింది. సుఖమయమైన జీవితంనుంచి, పస్తుపడి వుండవలసినగతి వచ్చింది. స్వంతపాక పోగొట్టుకొన్నాక, అద్దెకొంపదిక్కైంది. తన స్వంతరిక్షాపోయి బాడుగరిక్షా తోడయింది. ఎప్పుడూ డబ్బులు గలగలలాడే రోజులుపోయి రాగి

మ్మిడీలకోసం అల్లాటేరోజులొచ్చాయ్. ఏమైనా పండుగలొస్తే తప్పకుండా కొత్తబట్టలు కొనేఅతనికి, నెలలపర్యంతరం యెవరో దానమిచ్చిన ఖాదీ చొక్కా వేసుకోనేస్థితిపట్టింది. అది దాదాపు చిరుగుల్తో శిధిలమైంది. ఆచొక్కానూ, టోపీనీ. తను క్లబ్బులో పనిచేసినరోజుల్లో ఓ ఆఫీసరు తనకిచ్చాడు. అప్పుడు నెలకు నాలుగురూపాయలుం దొరికేవి. క్లబ్బుమెంబర్లు అప్పుడప్పుడు తనతో పిచ్చిపిచ్చిగా మాట్లాడ్డం, టెన్నిసుబేట్లతో కొట్టడంచేత వెంకడికాపని అసహ్యంవేసింది. అంతేకాకుండా రోజూ వుదయం టెన్నిసుకోర్టుమీద 'రోలర్' యెద్దులా లాగవలసివుంటేది. అంచేత ఆపనికి స్వస్తి చెప్పాడు. మళ్ళీ యధాప్రకారం రిక్షా!

అలాయోచిస్తు వెంకడు చౌకులో కూచోనుంటే, జనం యెక్కువగా తిరుగుతూండటంచూచి, వెంకడు ఆశతో, "రిక్షా కావాలీ బాబూ. రిక్షా" అంటూ వెంబడిపడ్డా ప్రయోజనం లేకపోయింది... అతనికి నోళ్ళుమండిపోయింది...తను యేకాకి, అందరిచేతా. తిరస్కరింపబడ్డవాడు. అలాంటప్పుడు జీవితంలో దేన్నైనా యెందుకు లెక్కచేయాలీ?

ఓమూలలో ట్రామ్ ఆగింది. ఆట్రాములోంచి సాధారణంగా, రిక్షావాళ్ళకి ప్రియమైన వో పెద్దమనిషి దిగడంచూచాడు. అతడు చౌకులో కనిపించాడంటేసరి, రిక్షావాళ్లంతా అతన్ని చుట్టుముడతారు. ఎందుకంటే అతను తనజేబులోంచి యెంతచేతికొస్తే అంతయిచ్చేస్తాడు రూపాయిగాని, కానీగాని...రిక్షావాళ్లు రూపాయిచ్చినా గానీ, కానీయిచ్చినాగానీ, సంతోషంగా తీసుకొంటారు మారుమాటాడకుండా. తక్కువకూలిరావడం తప్పించుకోడానికి వకరిక్షావాడు, "బాబూ! యీవేళపస్తున్నాను. నాకో అరణాలు దయచేయండి." అని అడగడం మామూలు. కానీ సాధారణంగా వాళ్ళు యెంతయిస్తే అంతపుచ్చుకుంటారు.

అతన్నిచూస్తేనే వెంకడికి ప్రాణంలేచివచ్చింది. "దేవుడుకింకా నామీద దయవుంది. రిక్షాయజమాన్ని, యింటిదగ్గిర దెయ్యాన్ని తృప్తిపరచడానికి సరిపోయేడబ్బులు యీయనవద్ద సంపాయించవచ్చు, ఇద్దరిపీడ తప్పుతుంది." అనిఅనుకుంటూ రిక్షాతో గంతువేసాడు. తనతోపాటు యింకా యిద్దరు అయన్ని సమీపిస్తున్నారు. ఏమైనాఆయన్ని తనరిక్షా యెక్కించుక తీరాలనుకున్నాడు. వాళ్లకంటె తను వేగంగా పరుగెత్తలేడూ!

శరవేగంగా అతను పరుగెడుతున్నాడు, ట్రాములు, బస్సులు, సైకిళ్లు గందరగోళంగావున్నై. వెంకడికంటికవేవీ గోచరించలా, ట్రామ్‌లైన్‌మీద నిల్చున్న ఆపెద్దమనిషితప్ప, మోటార్ల హారన్లు,బండ్ల చప్పుడు, అతనికేమీ వినబడలా. తనతో పోటీపడ్డ రిక్షాల చక్రాల టకటకలు మినహా...పోలీసు చూపేత్రోవ వదలి తప్పుతోవనబడ్డాడు, ఆ మైకంలో "యేయ్‌రిక్షా చచ్చిపోతావ్!" అనే పోలీసు కేకనుకూడా లెక్కచేయకుండా...ఆక్షణం ఓ లారీ అతని రిక్షాని గుద్దుకుంది. అంతా చట్నీఐపోయి, ఆపెద్దమనిషి నిలుచున్నచోటికి దొర్లిపోయింది.యీ ప్రపంచబాధలనుంచి విముక్తినొందిన వెంకడికోరికననుసరించేకాబోలన్నట్టు!...


భారతదేశంలో అతి శ్రేష్ఠమైనది




జాబ్కో ఫౌంటింక్

అతి చవక